క్లుప్తంగా

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి

హన్మకొండ : తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందించాలని 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత సూచించారు. శనివారం హనుమకొండ సుబేదారి అలీపురలో ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త డస్ట్ బిన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జవాన్ సతీష్ కుమార్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీగా రాజుయాదవ్



శ్రీకాంత్‌ను కలిసిన తొట్ల రాజుయాదవ్

హన్మకొండ: రాష్ట్ర ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీగా కాజీపేట మండలం మడికొండకు చెందిన తొట్ల రాజుయాదవ్‌ను ఎంపిక చేసినట్లు రాష్ట్ర ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్ ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో రాజుయాదవ్ శ్రీకాంత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి అతని నుంచి నియామకపత్రం అందుకున్నారు. రాజుయాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు, రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి, కృతజ్ఞతలు తెలిపారు.

దళిత పోలీసు అధికారులకు నివాళి

హన్మకొండ : దోపిడీ కులాల దురహంకారానికి విధి నిర్వహణలో ఒత్తిడికి గురై అసువులు బాసిన దళిత పోలీసు అధికారులు పూరన్ కుమార్ ఐపీఎస్, ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తిలకు శనివారం మడికొండ అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా విజయ్



నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల ఇన్‌చార్జ్ రాజేశ్వర్‌రావు

నయీంనగర్ : ఆర్యవైశ్య సంఘం హనుమకొండ మండల అధ్యక్షుడిగా అంచూరి విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నగరంలో ఈ ఎన్నికలు నిర్వహించగా అధ్యక్ష పదవికి విజయ్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఆయన ఏకగ్రీవమైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ చకిలం రాజేశ్వర్‌రావు ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందించారు. ఎన్నికల పర్యవేక్షకులు ఐత వెంకటేశ్వర్లు, మునీందర్, తదితరులు పాల్గొన్నారు.


మైనార్టీ ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట



ఖుస్రు పాషాను సన్మానిస్తున్న జమా మజీదు కమిటీ సభ్యులు

కాజీపేట : రాష్ట్రంలో ఉన్న మైనార్టీ ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా బియాబాని అన్నారు. మండల కేంద్రంలో శనివారం జమా మజీదు అభివృద్ధి కమిటీ సభ్యులు ఖుస్రు పాషాను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ముస్లింల ఖబ్రస్తాన్ కోసం 3 ఎకరాల స్థలం ఇప్పించడానికి తోడ్పాటును అందించడంపై కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్ రజాలీ, కమిటీ అధ్యక్షుడు ఖాజా సహిద్, షేక్ అస్గర్, షేక్ మహమూద్, బిలాల్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్



వరంగల్ అర్బన్ : తెలంగాణ మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జన్ను ప్రకాశ్ ఎన్నికైనట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సింగారపు బాబు, అధ్యక్షుడిగా సింగారపు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓరుగంటి జీవన్‌కుమార్, కోశాధికారిగా పత్తిపాక వినయ్, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, బొజ్జ రాజు, అశోక్, సహాయ కార్యదర్శిగా జక్కడి రామకృష్ణను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

అమ్మకానికి చెరువు శిఖం భూమి

- దర్జాగా చదును
- మత్తడి తొలగింపు
- అధికార పార్టీ నేతలే రియల్టర్లు

హసన్‌పర్తి : మండలంలోని దేవన్నపేట తూర్పు చెరువు శిఖం భూమి అమ్మకానికి పెట్టారు. చెరువు శిఖంను కూడా చదును చేశారు. దేవన్నపేటలోని సర్వే నంబర్ 56లో తూర్పు చెరువు సుమారు తొమ్మిది ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు హన్మకొండ–మడిపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని ఉండగా ప్రస్తుతం ఒక్క ఎకరానికి రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల మేర ధర పలుకుతోంది. ఇప్పటికే మూడెకరాల మేరకు ఈ చెరువు కబ్జాకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఈచెరువు శిఖంపై కొంత మంది రియల్టర్ల కన్ను పడింది.

మత్తడి తొలగింపు

కొంతమంది వ్యక్తులు ఈ చెరువు శిఖంను కబ్జా చేశారు. అంతటితో ఆగకుండా చెరువు మత్తడిని కూడా తొలగించారు. ఈ శిఖంను చదును చేసి అమ్మకానికి పెట్టినట్లు స్థానికులు తెలిపారు.



చదును చేసిన చెరువు శిఖం



ఆందోళన చేస్తున్న స్థానికులు

స్థానికుల ఆందోళన

చెరువు శిఖంను చదును చేయడమే కాకుండా మత్తడి తొలగింపుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్తడి తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకులే ఈ వ్యవహారానికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మత్తడి తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటాం.మత్తడి తొలగించి, శిఖం చదును చేసినట్లు స్థానికుల సమాచారం మేరకు క్షేత్రస్థాయిలో సందర్శించాను. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తా.

– శ్రీనివాస్,ఏఈ

క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుంది

- కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం



పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం

మామునూరు : క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారుల్లో స్నేహ భావంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామ చంద్రం, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వై.వెంకటయ్య, వాగ్దేవి కళాశాల డైరెక్టర్లు వాణీదేవి, సీహెచ్.సుదర్శన్‌రెడ్డి, ఇంతేజార్‌గంజ్, మామునూరు సీఐలు సుక్రు, రమేష్ అన్నారు. శనివారం ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడామైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సునీల్‌రెడ్డి సహకారంతో 11 నుంచి 13 వరకు జరగనున్న యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఫర్ ఉమెన్స్ 2025–26 టోర్నమెంట్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా వారు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కేయూ పరిధిలోని వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, చెస్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నీస్, బాల్ బ్యాడ్మింటన్, క్రాస్ కంట్రీ తదితర క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీపతి, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, 1500 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

న్యూశాయంపేట : ముస్లిం మైనార్టీ హక్కుల సాధనకు ఐకమత్యంతో ఉద్యమించాలని ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్(ఎంయూడీఎం) అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ మండిబజార్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పార్టీలు ముస్లింలను తమ ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని అభివృద్ధి మరిచారని ఆరోపించారు. పోరాటాల ద్వారానే ముస్లీంల హక్కులను సాధించవచ్చన్నారు. ఇందులో భాగంగా ఎంయూడీఎం గ్రేటర్ వరంగల్ సర్వసభ్య సమావేశం నేడు (ఆదివారం) వరంగల్ ఉర్సు గడీలో సాయంత్రం 5 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మహ్మద్ సర్వర్(మున్నాభాయ్) అడ్వైజర్లు మహ్మద్ అలీ జుబేర్, మహ్మద్ పర్వేజ్, మహ్మద్ ఖలీల్(అడ్వకేట్), మహ్మద్ అస్లం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పాటుపడని పార్టీలను బహిష్కరించాలి

ముస్లింల ఓట్లు తీసుకుని వారి అభివృద్ధికి పాటుపడని పార్టీలను రానున్న ఎన్నికల్లో బహిష్కరించాలని మైనారిటీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ అబ్దుల్ ఖుద్దూస్ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలు భావోద్వేగంతో కాదు వ్యూహాత్మకంగా ఓటు వేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాకు ప్రాతినిధ్యం లేకుంటే మీకు ఓటు లేదు అనే నినాదంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఫోరం ప్రతినిధులు ఇఫత్, మున్నా, సుభాన్ అహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ సుభాన్

ముగిసిన టీటీడీ ఆధ్యాత్మిక కార్యక్రమాలు



భజనలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. హనుమకొండలోని ఆనంద ఆశ్రమంలో జరిగిన ప్రతీ రోజు జరిగిన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, భజనలు జరిగాయి. ప్రోగ్రాం ఇన్‌చార్జ్ రామిరెడ్డి కృష్ణమూర్తి, ఆశ్రమ నిర్వాహకులు సిహెచ్.లక్ష్మీనారాయణ, పద్మావతి, నాగమణి, రాధిక, భాస్కరాచార్య, భక్తులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సంఘానికి గుర్తింపు



యూనియన్ రిజిస్ట్రేషన్ పత్రం అందుకుంటున్న మహెమూద

హన్మకొండ అర్బన్ : రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ చేతుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు మహెమూద శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లుగా ఆశ వర్కర్స్ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా ఉంటూ ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. కనీస వేతనం లేకుండా ఏళ్ల తరబడి పనిచేస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్స్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ తమ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశాలకు న్యాయం చేయడం కోసం కృషి చేస్తామన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం, రూ.18 వేల ఫిక్స్‌డ్ జీతం ప్రభుత్వం ప్రకటించే వరకు సంఘం పోరాడుతుందన్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లందరూ కూడా యూనియన్ బలోపేతం చేసుకొని ఒకే ఎజెండాతో ముందుకు వెళ్లడానికి ఐక్యతగా కదిలిరావాలని పిలుపునిచ్చారు.

అగ్రకులాల కుట్రలను బీసీలు తిప్పికొట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

వరంగల్ : అగ్ర కులాలు చేస్తున్న కుట్రలను బీసీలు తిప్పికొట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ పోచమ్మమైదాన్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం వల్లనే రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియలో అనేక ఆటంకాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, జిల్లా నాయకులు పరికరాల రమేష్, గంగాధరీ జగదీష్, ఓడెల భద్రయ్య, ఎల్.రామకృష్ణ, చంద్రశేఖర్, సయ్యద్ యాకూబ్, ఎండి.సద్దాం హుస్సేన్, ఎండి.షఫీ, లావుడ్య దస్రూ పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్

వరంగల్ చౌరస్తా : వరంగల్ నగరంలో నివసించే పేదల కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ఆదుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. శనివారం వరంగల్ నగరంలోని జక్కలొద్ది గుడిసెవాసుల జనరల్ బాడీ సమావేశం ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు గణిపాక ఓదేలు అధ్యక్షతన స్థానిక అండర్ బ్రిడ్జి ప్రాంతంలోని పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సమావేశానికి రమేశ్ హాజరై మాట్లాడుతూ నిలువ నీడ లేని పేదలు రెక్కాడితే డొక్కాడని పరిస్థితిలో అక్కడ పొట్ట చేత పట్టుకొని వేలాదిమంది పట్టణాలకు వలస వస్తున్నారన్నారు. అధికార యంత్రాంగం పేదల నివసిస్తున్న కాలనీలకు సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్, పార్టీ జిల్లా, నగర నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, కన్నం వెంకన్న, కుసుంబ బాబురావు, జగదీశ్వర్, రామస్వామి, ప్రత్యూష, మహమ్మద్ మహబూబ్ పాషా, రత్నం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు రక్తదాన శిబిరం

నయీంనగర్ : హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఆదివారం రెడ్‌క్రాస్ సొసైటీ, ఎంజీఎం వరంగల్, తలసేమియా వ్యాధిగ్రస్తులు, అత్యవసర వ్యాధిగ్రస్తుల తక్షణ సాయం కోసం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని క్రెడాయి అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమర్ తెలిపారు.

మేఘకు సన్మానం

హసన్‌పర్తి : ఇటీవల గ్రూప్–1 ఉద్యోగానికి ఎంపికైన శీలం మేఘను రిటైర్డ్ మిలిటరీ అధికారులు ఘనంగా సన్మానించారు. శనివారం భీమారంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ మిలిటరీ అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ సూర్యుడు నారాయణ

విద్యారణ్యపురి : ఉపాధ్యాయ ఉద్యమంలో అనేక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేసిన ఉద్యమ సూర్యుడు నాగటి నారాయణ అని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు డి.కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన నారాయణ మూడో వర్ధంతిని హనుమకొండలోని ఆ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్‌రావు, వరంగల్ జిల్లా కార్యదర్శి టి.వి సత్యనారాయణ పాల్గొన్నారు.

బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ చేయూత

హన్మకొండ : కాజీపేట మండలం మడికొండకు చెందిన మిర్యాల యశోద- రమేష్‌ల కుమారుడు మిర్యాల లక్కి(4) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలుడి తల్లిదండ్రులకు రూ. 10వేలతో పాటుగా ఒక క్వింటా బియ్యంను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులో ఉన్న కుటుంబాన్ని ఆదుకునేందుకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందన్నారు. ఉపాధ్యాయుడు చంద్రయ్య, బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువు మానసిక ఆరోగ్యం

ఖిలా వరంగల్ : ఒత్తిడి లేని చదువు మానసిక ఆరోగ్యానికి నెలవు అని సైకాలజిస్ట్ రమేష్ దడిగల అన్నారు. శనివారం వరంగల్ ఉర్సుగుట్టరోడ్డులోని మహాత్మాజ్యోతి బాపూలే స్కూల్, కళాశాలలో ప్రిన్సి పాల్ అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమైందన్నారు. ప్రతి ఏడు నిమిషాలకు ఒక్కరూ మానసిక ఆందోళనకు గురై మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలల సంక్షేమ సమితి సభ్యుడు కె.దామోదర్ మాట్లాడుతూ ఉద్వేగభరితమైన ఆలోచనలు కలిగే వయసులో సరైన దిశలో మళ్లించాలని, శాస్త్రవేత్తల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని ఉన్నతికి ఎదగాలని సూచించారు.

ప్లేట్ నింపండి.. చిరునవ్వు పంచుకోండి

హసన్‌పర్తి : నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో 'ప్లేట్ నింపండి.. చిరునవ్వు పంచుకోండి' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం ఆహార విరాళాలను సేకరించారు. ఎస్సై కృష్ణారెడ్డి, రియల్టర్ రమేశ్ సహకారంతో ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కార్యక్రమం కొనసాగలింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో మానవత విలువలు, దయ, సామాజిక అవగాహన పెంపొందుతుందన్నారు.

బాలికల విద్యకు తోడ్పాటునందించాలి

ఖిలా వరంగల్ : బాలికల విద్యకు తోడ్పాటునందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మండల పరశురాములు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం శివనగర్‌లోని డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ కోషి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని అదరణ నిరాధరణకు గురైన బాలికలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు నేర్పించుటలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జిల్లా బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ ఎస్.ప్రవీణ్‌కుమార్, సంతోష్‌కుమార్, వెన్నెల, దీన, తదితరులు పాల్గొన్నారు

సుమతిరెడ్డిలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

హసన్‌పర్తి : మండలంలోని అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీటెక్, బీఈ, ఎంసీఏ, బీసీఏ చదువుతున్న విద్యార్థినులు హాజరై తమ ప్రతిభను కనబరిచారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజ రయ్యారు. సిగ్నావోక్స్ టెక్నాలజీ సంస్థ ప్లేస్‌మెంట్స్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే అనుచరుడిపై కేసు

హసన్‌పర్తి : కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘర్షణలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే అనుచరుడిపై కేసు నమోదైంది. ఓ సివిల్ తగాదాలో ఆత్మకూర్‌కు చెందిన శ్రీకాంత్, ఎమ్మెల్యే అనుచరుడు రాహుల్‌రెడ్డి మధ్య ఘర్షణ జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. ఈ క్రమంలో పోలీసుల సమక్షంలోనే శ్రీకాంత్‌పై రాహుల్‌రెడ్డి దాడికి పాల్పడ్డాడు. ఈమేరకు బాధితుడు అదే రోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు రాహుల్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్సవాలకు సహకరించిన వారికి ధన్యవాదాలు



మాట్లాడుతున్న దూపం సంపత్

వరంగల్ : కాశిబుగ్గ దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 1986 నుంచి గత ఏడాది వరకు జరిగిన ఉత్సవాలకు సహకరించిన దాతలు, ప్రజలకు ధన్యవాదాలు ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, కన్వీనర్ బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ తెలిపారు. శనివారం కాశిబుగ్గలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో 2009 నుంచి 2025 మార్చి వరకు ఉత్సవ సమితి లెక్కలను ప్రకటించారు. సమావేశంలో ఉత్సవ సమితి నాయకులు ఓని భాస్కర్, బాంబుల కుమార్, గోరంట్ల మనోహర్, గుత్తికొండ నవీన్, సిద్దోజు శ్రీను, వేముల నాగరాజు, గణపాక సుధాకర్ పాల్గొన్నారు.

అంతా గోల్‌మాల్...

దసరా ఉత్సవ సమితి నిర్వాహకులు చూపెట్టిన లెక్కలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్సవ సమితి వసూలు చేసిన డబ్బులు అదే పేరుతో నిర్వహిస్తున్న పరపతి సంఘంలోని కొంత డబ్బులు తీసుకున్నప్పటికీ అట్టి లెక్కలను సమావేశంలో ప్రకటించలేదని సభ్యులు ఆరోపిస్తున్నారు. సంఘం డబ్బులు రూ.6 లక్షలకు పైగా వాడుకున్న కోశాధికారి వద్ద నుంచి వసూలు చేస్తామని అగ్రిమెంటు చేసుకున్న బాధ్యులు మార్చిలోగా సభ్యులకు అప్పగించాల్సి ఉంటుంది. ఈ లెక్కలు మొత్తం గోల్‌మాల్‌గా ఉన్నాయని మెజార్టీ ఉత్సవ సమితి సభ్యులు, సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు.

సమాచార హక్కు చట్టానికి జీవం పోయండి



కేక్ కట్ చేస్తున్న స.హ.చట్టం బాధ్యులు

హన్మకొండ చౌరస్తా : గత ప్రభుత్వం నిర్వాహకం ఫలితంగా రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం అమలు నీరుగారిపోయిందని పలువురు సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం హనుమకొండలోని కళ్యాణి ఆస్పత్రిలో చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర నాయకుడు పర్చా కోదండరామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ పాల్గొని మాట్లాడారు. చర్చాగోష్టి అనంతరం ఏసీబీ చిక్కిన అవినీతి అధికారులను ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరుతూ కోదండ రామారావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో కామిడి సతీష్‌రెడ్డి, గూడూరు స్వామిరెడ్డి, ప్రకాష్, చంద్రశేఖర్, చైతన్యరెడ్డి, కృష్ణమూర్తి, సురేందర్, రవీందర్ పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ ఇర్ఫాన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు

వరంగల్ క్రైం: హనుమకొండ కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇటీవల లైంగిక ఆరోపణలతో సస్పెండ్‌కు గురైన ఇర్ఫాన్‌పై సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఇర్ఫాన్ మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేసి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ ఘటనలో బాధిత మహిళా ఉద్యోగి సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.